

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## వెల్ డన్ లోకేష్

- తనయుడికి భువనేశ్వరి ప్రశంసలు

3



# ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు

- మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయండి
- రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించండి
- రైతులు నష్టపోకుండా చూడాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రైతులు ఇప్పటికే పంట కోసి ధాన్యాన్ని రాసులుగా పోసి ఉంటే వర్షాలకు తడవకుండా కాపాడేందుకు వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లను ఆదేశించారు. ధాన్యపు రాశులను వర్షాలకు తడవకుండా సమీప రైసు మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అదే విధంగా ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు సమకూర్చాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. వర్షాలు పడే సమయంలో రైతులెవరూ పంట కోతలు చేపట్టకుండా వ్యవసాయ శాఖ సూచనలను రైతులందరూ పాటించే విధంగా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.



### యువనేత నారా లోకేష్..

# పుత్రోత్సాహానికి ప్రతీక !

మాటల్లో చాతుర్యం.. చర్చల్లో చాణక్యం

ఒకే ఒక్క ఫోన్ కాల్‌తో రూ. లక్షల కోట్ల పెట్టుబడులు

ఒక్క మీటింగ్‌తో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటుకు రంగం సిద్ధం

ఒక్క జూమ్ కాల్‌తో భారీ ఉక్కు పరిశ్రమ రాక

అరుదైన లక్షణాల కలబోత..

2



## శకునిలాంటి వ్యక్తి విజయసాయి రెడ్డి

- హోం మంత్రి అనిత ధ్వజం
- వైసీపీ పాపాలు బయటపడుతుంటే ట్వీట్లు పెరుగుతున్నాయని ఎద్దేవా
- కాకినాడ పోర్ట్‌లో దందాలన్నీ వెలికితీస్తాం
- భూ అక్రమాలన్నింటిలో వైసీపీ నేతలే పాత్రధారులు

4



## 14న విజయవాడలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ

- హాజరు కానున్న సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- వేడుకల్లో 'తారక రామం' పుస్తకం విడుదల
- హైదరాబాద్లో 100 అడుగుల విగ్రహం, డిజిటల్ మ్యూజియం
- ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్ వెల్లడి

2



## సీఎం చంద్రబాబు నేతృత్వంలో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

- ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ ఆకాంక్ష
- రాష్ట్రాభివృద్ధి కోసం దుర్గమ్మకు పూజలు

4



## దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించండి

- సీఎం చంద్రబాబుకు వీహెచ్‌పీ నేతల వినతి

4



## దోచుకున్నదంతా కక్కిస్తాం



- వైసీపీ నేతలకు మంత్రి మండిపల్లి హెచ్చరిక
- జగన్ ప్రభుత్వ అవినీతిపై సమగ్ర దర్యాప్తు
- అధికారుల పనితీరు మారాలి
- లేకుంటే చట్టపరమైన చర్యలు

3

### సీఎంపై అనుచిత వ్యాఖ్యలు..

## విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- విజయవాడ సీపీకి టీడీపీ నేత బుద్దా వెంకన్న ఫిర్యాదు
- సీఎంని బెదిరించేలా విజయసాయి మాటలు
- అవసరమైతే కోర్టుకు వెళతామని స్పష్టీకరణ
- నోరు అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లిస్తారు

3



చైతన్యరథం



## యువనేత నారా లోకేష్..

# పుత్రోత్సాహానికి ప్రతీక !

**మాటల్లో చాతుర్యం.. చర్చల్లో చాణక్యం**

**ఒకే ఒక్క ఫోన్ కాల్‌తో రూ. లక్షల కోట్ల పెట్టుబడులు**

**ఒక్క మీటింగ్‌తో టీసీఎస్ కేంపస్ ఏర్పాటుకు రంగం సిద్ధం**

**ఒక్క జూమ్ కాల్‌తో భారీ ఉక్కు పరిశ్రమ రాక**

**అరుదైన లక్షణాల కలబోత..**

అమరావతి, (చైతన్యరథం) : తండ్రికి పుత్రోత్సాహం.. తల్లికి తోడు, నీడ .. స్నేహానికి చిరునామా ఇది ఆయన వ్యక్తి గత జీవితం.. ఇక రెండోది ప్రజా జీవితం చదువుల కోసం తండ్రి దాటు బిడ్డగా విదేశాలకు వెళ్లినా ఆ యువకుడి మనసంతా మాతృభూమి పైనే.... ఇంటిబెంగ పేరుతో తిరుగు టపాలో రాలేదు. బుద్ధిగా చదువుకుంటూనే విదేశీ విద్యా విధానాన్ని ఆకళింపు చేసుకుంటూ.. సదవకాశాలను అవగాహన చేసుకుంటూ సత్ఫలితాలను మాతృభూమికి బదలాయించిన యువ కిశోరం నారా లోకేష్. ఇప్పుడా చదువు సంధ్యలు, శక్తి యుక్తులు ఆయన మాటల రూపంలో చేతల రూపంలో, చర్చల రూపంలో చేసిన కృషితో పెట్టుబడులు వరదలా వచ్చి పడుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రిగా ఆయన చేసిన పర్యటనలు ఫలితాలిస్తున్నాయి. ఒక్క ఫోన్ కాల్‌తో అక్షరాలా లక్షా నలభై ఏడు వేల(1.47 లక్షలు) కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చి పడుతున్నాయి. టీసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో జరిగిన ఒక్క సమావేశంతో టీసీఎస్ కేంపస్ ఏర్పాటుకు రంగం సిద్ధమయింది. నిప్పన్, మిట్టల్, నిప్పన్ జాయింట్ వెంచర్‌గా భారీ స్థాయిలో స్టీల్ పరిశ్రమ రాకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### ఒక్క పిలుపుతో..

ఒక్క పిలుపుతో 45 వేల పాఠశాలల్లో దాదాపు 7 లక్షల మంది తల్లిదండ్రులు, టీచర్లు, విద్యార్థులు సమావేశం కావడం పాఠశాల విద్య చరిత్రలోనే అరుదైన విషయం. వారి మధ్య చర్చలు, సమస్యలకు పరిష్కార మార్గాలు, అభివృద్ధికి ప్రణాళికలు.. మొత్తంగా విద్యావ్యవస్థ కొత్త కళను సంతరించుకుంది. యుక్త వయసులోనే ఎన్నో అనుభవాలను గుండెల్లో నింపుకుని మాతృ గడ్డపై అడుగు పెట్టిన యువరత్నం లోకేష్, వచ్చీ రాగానే తండ్రి పలుకుబడిని, ఏలుబడిని అడ్డుపెట్టుకుని దోపిడీ వ్యాపారంలోకి దిగలేదు. తండ్రి నీడలో ప్రజా జీవిత పరిణామాలను చదవడానికి ఉపక్రమించి బుడిబుడి నడకల్లోనే విపక్షాలకు కన్ను కుట్టి అడ్డాల నాడే విమర్శలను తిప్పికొడుతూ నిలబడిన నారా లోకేష్ తన రాజకీయ ప్రస్థానం నల్లేరు మీద నడక కాదని ఎన్నోసార్లు రుజువు చేసుకున్నారు. రాటుదేలారు. రాణించారు. తటబాటు లేదు.. ఏమరు పాటు అసలే లేదు. అప్పుడెప్పుడో ఆయన మాటల్లో తడబాటును విమర్శిస్తూ శునకానందం పొంది రొమ్ములు ఎగరేసిన వారు, బోర విరుచుకు పడ్డ వారు, పంచెలు ఎగ్గొట్టిన వారంతా నేడు నోరెత్తాలంటే ఒళ్లంతా చమటలు పట్టి గొంతు తడారి పోయే పరిస్థితికి తెచ్చిన నారా లోకేష్‌ను అంచనా వేయడంలో ప్రత్యర్థులు తప్పులో కాలేశారు. ఒక్క ఛాన్స్ పేరిట సానుభూతి పవనాల్లో, అసత్య ప్రచారాలతో అందలం ఎక్కిన వారికి.. తండ్రి చంద్రబాబు మాటున రాటుతేలిన లోకేష్ పరిణతి వారి అంచనాలకు కూడా అందనంతగా ఎదిగింది.

### అదే పట్టుదల..

అధికారం పోయిందని నీరుగారి పోలేదు. పోయిన చోటే వెతుక్కోవాలనే నియమంతో పార్టీని చక్కబెట్టుకుంటున్న తరుణంలో కన్న తండ్రి, పార్టీ పెద్ద దిక్కును జైలుకు పంపి వికటాట్టహాసం చేస్తున్న పిశాచి మూకల మూకుమ్మడి దాడికి తల్లడిల్లి పోయినా, తట్టుకుని నిలబడ్డాడు. తనకు అండగా నిలబడే వాళ్లు కూడా నీరు గారి పోయి నప్పుడు పద్మవ్యూహంలో చిక్కుకన్న అభిమన్యుడిలా కాకుండా కాకలు తీరిన అపర సవ్యసాచిలా పరిస్థితిని చక్కదిద్ది తండ్రికి పుత్రోత్సాహాన్ని, తల్లికి వాత్సల్యాన్ని, పార్టీకి భరోసాను అందిచిన లోకేష్ సహనం, సంయమనం అనితర సాధ్యం. నిజానికి 2012 సంవత్సరంలోనే కడప జిల్లా ప్రొద్దుటూరులో రాజకీయ పసి ప్రాయంలో ఆయన చేసిన ప్రకటన కొమ్ములు తిరిగిన రాజకీయ నాయకుల్లో ప్రకంపనలు రేపింది. యువ నేతల గుండెల్లో గుబులు రేపింది. అదే డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ స్కీం. అయితే అప్పట్లో ఆ ప్రతిపాదన అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు పెద్దాయన మనస్సులో ఏదైనా ఆలోచన వచ్చిందని తెలియడమే ఆలస్యం.. వాయు వేగంతో అమలు చేసేందుకు లోకేష్ రంగంలోకి దిగిపోతున్నారు.

### పాఠశాలల్లో పండుగ..

అందుకు నిదర్శనం రెండు రోజుల క్రితం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమ్మేళనం. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని తెచ్చింది. పెద్దాయన చంద్రబాబు చెప్పినట్లుగానే సంక్రాంతి పండుగ నెల ముందుగానే వచ్చినట్లుగా విద్యారంగ వాకిళ్లన్నీ కళకళలాడాయి. ఏపీ వ్యాప్తంగా స్కూళ్లలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఉత్సాహంగా సాగింది. అన్ని చోట్లా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు. అక్కడికక్కడ విద్యార్థుల తల్లిదండ్రులతో స్కూళ్ల సమస్యలపైనా చర్చించారు. వాటిని పరిష్కరించేందుకు మార్గాలను కూడా చర్చించుకున్నారు. ప్రభుత్వ స్కూళ్లు అంటే ఇప్పటి వరకూ విద్యార్థులు సమయానికి వస్తారు.. వెళ్తారు అన్నట్లుగా ఉంటుంది. అయితే విద్యార్థుల్ని వ్యక్తిగతంగా కూడా ఎసెస్ చేస్తామని వారి తల్లిదండ్రులకు ఈ పీటీఎం ద్వారా భరోసా ఇచ్చారు. ప్రైవేటు స్కూళ్లలో పీటీఎంసు ప్రతి మూడు నెలలకోసారి నిర్వహిస్తూనే ఉంటారు. కానీ ప్రభుత్వ స్కూళ్లలో మాత్రం అరుదు. రాజకీయ కార్యక్రమంలా కాకుండా పూర్తిగా విద్యార్థుల భవిష్యత్ కోసం, స్కూళ్ల మెరుగు కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం అందర్నీ ఆకట్టుకుంది. చంద్రబాబు, లోకేష్ బాపట్లలోని ఒకే స్కూల్‌లో పీటీఎంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కొంత మంది పిల్లలతో స్వయంగా మాట్లాడారు. కడపలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. అక్కడ స్కూల్‌కు కావాల్సిన కిచెన్ సదుపాయాల్ని వ్యక్తిగత సొమ్ముతో నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పీటీఎంపై టీచర్లు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల తాము భావి భవిష్యత్ ను తీర్చిదిద్దుతున్నామన్న స్ఫూర్తి మెరుగుపడుతుందని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేటు స్కూల్స్ కంటే మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చెబుతున్నారు. స్కూళ్ల మెరుగు అంటే రంగులు వేయడం, బల్లలు కొనడం కాదని.. విద్యార్థులకు చదువు చెప్పే ప్రమాణాలు పెంచడం అని ఈ ప్రభుత్వం నిరూపిస్తోంది.

### ఎప్పుడూ జనంతోనే..

ప్రతిపక్షంలో ఉంటే రోడ్డు మీద, అధికారంలో ఉంటే ప్యాలస్ గేటు లోపల అన్న రాజకీయం కాదు, ప్రభుత్వంలో ఉంటే పరదాలు, ప్రతిపక్షంలో ఉంటే ప్రజలు అనే నాయకుడు కాదు, అధికారం లేకపోతే శవ రాజకీయాలు, అధికారం ఉంటే దోపిడీ రాజకీయాలు నడిపే నేత కాదు. గెలిచినప్పుడు వచ్చే హెూదా చూసుకుని రెచ్చిపోయిన వాడు కాదు, ఓటమి వచ్చినప్పుడు లేని హెూదా కోసం పాకులాడే వ్యక్తి కాదు. గెలిచినా ఓడినా ప్రజలు మధ్యే అన్నట్టుగా దూసుకెళ్తున్న టీడీపీ యువనేత నారా లోకేష్ గెలుపుకి ముందు యువగళం అంటూ పాదయాత్ర పేరుతో ప్రజల మధ్యకు వెళ్లారు. ఇప్పుడు గెలిచిన తరువాత ఒక పక్క పార్టీ పనులు చక్కబెడుతూ, ఐటీ, విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క ప్రజా సమస్యల పరిష్కారానికి ఉండవల్లి తన నివాసంలో ఉదయం ప్రజా దర్బార్ ఏర్పాటు చేస్తున్నారు. నాడు యువగళం పాదయాత్రతో ప్రజల సమస్యలను అవగాహన చేసుకుంటూనే, పార్టీ క్యాడర్‌కు నేనున్నాను అనే ధైర్యాన్ని అందించారు. నేడు ప్రజా దర్బార్ తో ఇటు తనను నమ్మి ఓటేసిన మంగళగిరి ప్రజలకు, రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సమస్యల గురించి విన్నవించుకోవడానికి వస్తున్న వారికి అందుబాటులో ఉంటూనే, తన శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు అందిస్తున్నారు.

### నాడు, నేడూ ప్రజా నాయకుడే..

తన పార్టీ అధికారంలోకి వచ్చే వరకు, తనకు ముఖ్యమంత్రి పదవి దక్కే వరకు పార్టీ కింద స్థాయి క్యాడర్ నుంచిపై స్థాయి నాయకత్వం వరకు అందరికీ అందుబాటులో ఉన్న జగన్ అధికారం వచ్చాక చివరికి తల్లి, చెల్లికి కూడా అందుబాటులో లేకుండా పోయారు. అలాగే ప్రతిపక్షంలో ఉన్నన్నాళ్ళు పాదయాత్రలు, ఓదార్పు యాత్రలు అంటూ ప్రజల మధ్య తిరిగి అధికారం చేతికందగానే ప్యాలస్ గేటు కూడా దాటలేదు. ప్రజల వద్దకే పాలన అంటూ ముఖ్యమంత్రిగా బాబు పాలన కొనసాగిస్తే, పరదాల చాటున పర్యటనలు చేసిన తొలి ముఖ్యమంత్రిగా జగన్ కొత్త చరిత్రకు నాంది పలికారు. తండ్రి చంద్రబాబు నాయకత్వం మాదిరే లోకేష్ కూడా అటు పార్టీ క్యాడర్‌కు ఇటు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ నాడు నేడు ప్రజా నాయకుడే అన్నట్లుగా ముందుకెళ్తున్నారు. దటీజ్ యువ(గళం) నేత నారా లోకేష్.. ఆయనకు ఆయనే సాటి.

# 14న విజయవాడలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ

- **హాజరు కానున్న సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**
- **వేడుకల్లో 'తారక రామం' పుస్తకం విడుదల**
- **హైదరాబాద్లో 100 అడుగుల విగ్రహం, డిజిటల్ మ్యూజియం**
- **ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్ధన్ వెల్లడి**



అమరావతి (చైతన్యరథం): దివంగత ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ విజయవాడలో ఈ నెల 14న జరగనుంది. దీనికి ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరు కానున్నారు. ఎన్టీఆర్ స్మారక లిటరేచర్ కమిటీ అధ్యక్షుడు టీడీ జనార్ధన్ ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. గత నెల 24 నాటికి ఎన్టీఆర్ తొలి సినిమా 'మన దేశం' విడుదలై 75 ఏళ్లు పూర్తయ్యాయని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకను నిర్వహిస్తున్నామని తెలిపారు. "తెలుగు సినీ జగత్తులోనే కాకుండా భారతీయ సినీ రంగంలో ఎన్టీఆర్ ఒక మేరునగ ధీరుడు. పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక... ఇలా ప్రతి పాత్రలోనూ ఆయన మేటి నటుడిగా నిలిచారు. ఒకే సినిమాలో నాయక, ప్రతినాయక పాత్రలు వేశారు. తనను ఎంతో ఆదరించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి రాజకీయ రంగంలోకి వచ్చిన ఆయన పేదవాడి మనసు తెలిసి వాళ్ల అవసరాలు తీర్చడానికి ఎంతో ప్రయత్నం చేశారు. 40 ఏళ్ల క్రితమే నదుల అనుసంధానం గురించి.. రాయలసీమకు సాగు నీటి ప్రాజెక్టుల అవసరాల గురించి ఆలోచన చేశారని జనార్ధన్ వివరించారు.

వజ్రోత్సవ వేడుకలకు ఎన్టీఆర్ కుమార్తెలు, కుమారులు పురందేశ్వరి, రామకృష్ణ, మోహనకృష్ణతోపాటు అక్కినేని నాగేశ్వరరావు, చిరంజీవి, కృష్ణ, రామానాయుడు కుటుంబ సభ్యులు కూడా హాజరవుతున్నారు. సినీ రంగంలో ఎన్టీఆర్‌తోపాటు కలిసి పనిచేసిన కళాకారులు, టెక్నీషియన్లు, దర్శకులను కూడా ఆహ్వానిస్తున్నాం. ఈ నెల 14న విజయవాడ శివారులోని పెనమలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఓ రిసార్ట్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని జనార్ధన్ వివరించారు. ఎన్టీఆర్ సినీ విశేషాలతో ఒక యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేస్తే రెండున్నర నెలల్లో దానిని 1.26 కోట్ల మంది చూశారని, 27 వేల మంది సబ్‌స్క్రయిబ్ చేశారని చెప్పారు. 'మన దేశం' నుంచి మొదలుకొని ఎన్టీఆర్ నటించిన మూడు వందల సినిమాలకు సంబంధించిన సంక్షిప్త సమాచారంతో 'తారక రామం' పేరుతో ఒక పుస్తకాన్ని వజ్రోత్సవ వేడుకలో విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలుగునాట ఎన్టీఆర్ స్మృతి చిరస్థాయిగా ఉండటానికి హైదరాబాద్‌లో ఆయన 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి అక్కడ ఆయనకు సంబంధించిన విశేషాలతో డిజిటల్ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామని జనార్ధన్ తెలిపారు.



# వెల్ డన్ లోకేష్

## - తనయుడిపై భువనేశ్వరి ప్రశంసలు



అమరావతి (చైతన్యరథం): పాఠశాలలో జరిగిన పేరెంట్, టీచర్ సమావేశంలో విద్యార్థులతో మమేకమై నేల మీద కూర్చుని మధ్యాహ్న భోజనం చేసిన తరువాత సీఎం చంద్రబాబు తిన్న కంచాన్ని స్వయంగా తీసి ఆయనపై గౌరవం చాటుకున్న ఆయన తనయుడు, మంత్రి లోకేష్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ క్రమంలో లోకేష్ మాతృమూర్తి నారా భువనేశ్వరి కూడా తనయుడిని అభినందించారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండ్రీకొడుకులిద్దరూ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం పూర్తయిన తర్వాత చంద్రబాబు తిన్న ప్లేట్‌ను నారా లోకేష్ తీయడం అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై నారా భువనేశ్వరి స్పందించారు.

"వెల్ డన్ లోకేష్.. చంద్రబాబు తిన్న ప్లేట్‌ను నువ్వు తీయడం, భోజన అనంతరం శుభ్రం చేస్తున్న సిబ్బందికి సాయపడడం... తల్లిదండ్రుల పట్ల నీకున్న గౌరవాన్ని చాటి చెప్పడమే కాదు, నిత్యం మనకు సహాయకారిగా ఉండే వారి పట్ల ఎంతటి విధేయతను కలిగి ఉన్నావో ఈ చర్య ద్వారా స్పష్టమవుతోంది... నిజంగా ఇది స్ఫూర్తిదాయకం" అంటూ నారా భువనేశ్వరి తన కుమారుడిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ మేరకు ఆమె వీడియో కూడా పంచుకున్నారు.

# దోచుకున్నదంతా కక్కిస్తాం

- వైసీపీ నేతలకు మంత్రి మండిపల్లి హెచ్చరిక
- జగన్ ప్రభుత్వ అవినీతిపై సమగ్ర దర్యాప్తు
- అధికారుల పనితీరు మారాలి
- లేకుంటే చట్టపరమైన చర్యలు



చిత్తూరు (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాధనం దోచుకున్న వారి నుంచి అణా పైసలతో సహా మొత్తం రాబడతామని చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ నేతలు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని అన్నారు. అధికారుల పనితీరు మారకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన చిత్తూరు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం(డీఆర్‌సీ) ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. విద్యాశాఖ ప్రోటోకాల్ పాటించడం లేదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు కనీసం పరిగణనలోకి తీసుకోవడంలేదని మంత్రికి ఫిర్యాదు చేశారు. వైసీపీ పాలనలో ప్రజా ప్రతినిధులకు అణిగిమణిగి ఉన్న అధికారులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎందుకింత మార్పు అంటూ సూటిగా మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి ప్రశ్నించారు. జిల్లా అధికారులు పనితీరు మార్చుకోవాలని మంత్రి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, థామస్, ఎమ్మెల్సీ శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు.

### సీఎంపై అనుచిత వ్యాఖ్యలు..

# విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- విజయవాడ సీపీకి టీడీపీ నేత బుద్దా వెంకన్న ఫిర్యాదు
- సీఎంని బెదిరించేలా విజయసాయి మాటలు
- అవసరమైతే కోర్టుకు వెళతామని స్పష్టీకరణ
- నోరు అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లిస్తారు



విజయవాడ (చైతన్యరథం): సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విజయవాడ నగర పోలీసు కమిషనర్ రాజశేఖర బాబును కలిసి విజయసాయిరెడ్డిపై బుద్దా వెంకన్న ఫిర్యాదు చేశారు. అనంతరం బుద్దా వెంకన్న మాట్లాడుతూ విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. విజయసాయికి సిగ్గు, శరం అనేవి లేవన్నారు. కనీసం మనిషిలా కూడా మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అప్పటికి బతికి ఉంటే.. మేము అధికారంలోకి వస్తే జైల్లో వేస్తాం అని బెదిరింపు ధోరణిలో మాట్లాడారని ధ్వజమెత్తారు. విజయ సాయి బెదిరించి, బ్లాక్ మెయిల్ చేస్తే భయపడే వారు ఎవరూ లేరని బుద్దా దుయ్యబట్టారు. కాకినాడ పోర్టును జగన్ బలవంతంగా లాక్కున్నారనేది వాస్తవం కాదా. భారీ ఆదాయం వచ్చే ఆస్తులు ఎవరూ తక్కువ ధరు తెగనమ్ముకోరు. కేవీ రావు దగ్గర కాకినాడ పోర్టును మీరు ఎలా తీసుకున్నారో చెప్పాలి. 2019 నుంచి 2024 వరకు వైసీపీ నాయకులు చేసిన దాడులు, దారుణాలు అన్నీ ఇన్నీ కావు. ఎంతోమంది బాధితులు ఇప్పుడు పోలీసులకు, కలెక్టర్లకు ఫిర్యాదులు చేస్తున్నారు. కేవీ రావు కూడా ఇదే విధంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. కులాన్ని అంటగడతావా. జగన్ తప్పు చేయలేదని, పోర్టును బలవంతంగా లాక్కోలేదని నిరూపించే దమ్ము విజయసాయిరెడ్డికి ఉందా. మీ తప్పులు, పాపాలను ఎత్తి చూపితే.. కులం పేరుతో కుట్రలు చేస్తారా. చంద్రబాబుకు వార్నింగ్ ఇచ్చే స్థాయిలో మాట్లాడతావా.. ప్రజలు చెప్పులతో కొడతారు. గతంలో కూడా ఎక్స్‌లో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టారు.. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు విజయసాయి ఉన్మాదానికి పరాకాష్ట. మీ ప్రభుత్వం వస్తే... లోపలేస్తాం అని అంటే.. చంపుతామని వార్నింగ్ ఇస్తున్నారా.

నీలాంటోడిని ఏ మాత్రం ఉపేక్షించ కూడదు.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. సీఎంగా ఉన్న చంద్రబాబును బెదిరించినందుకు విజయసాయిరెడ్డిని అరెస్టు చేయాలి. పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశాం.. చట్టపరంగా సెక్షన్లు పెట్టి అరెస్టు చేయాలని కోరాం. అసలు విజయసాయిరెడ్డికి పరువు ఉందా.. పరువు నష్టం దావా వేయడానికి. నీకు దమ్ముంటే.. నాపై పరువు నష్టం దావా వేయి.. చూసుకుందాం. కాకినాడ పోర్టు అంశాన్ని పక్కదారి పట్టించేందుకు మైండ్ గేమ్ ఆడుతున్నారు. జగన్, వైసీపీ నాయకులపై బాధితులే ముందుకు వచ్చి కేసులు పెడుతున్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటే సహించలేక.. నోరు పారేసుకుంటున్నారు. గతంలో విశాఖలో మీడియా ప్రతినిధులను సైతం విజయసాయిరెడ్డి బూతులు తిట్టిన సంఘటనలు ఉన్నాయి. ఆ తర్వాత నుంచి హైదరాబాద్ లో కూర్చుని మాట్లాడుతున్నాడు. ఏపీకి వస్తే మీడియా వాళ్లే కొడతారని విజయసాయిరెడ్డికి భయం. చంద్రబాబుపై ఇప్పుడు చేసిన వ్యాఖ్యలకు విజయసాయిరెడ్డిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి. లేదంటే న్యాయస్థానానికి వెళ్లయినా పోరాటం చేస్తాం. కుల ముద్ర వేయడం ఏమిటి, జైలుకు పంపడం ఏమిటి, చంపుతామని బెదిరించడం ఏమిట. ఇక నుంచి విజయసాయిరెడ్డి ఏది వాగినా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. పోలీసు కమిషనర్ కూడా నా ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారు. న్యాయ నిపుణలను సంప్రదించి, చట్టపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసులు చర్యలు తీసుకోకపోతే.. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు.

# 'మనబడి' మాస పత్రికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

- విద్యార్థులు, ఉపాధ్యాయులకు కరదీపిక
- సమగ్ర శిక్షా పథక రాష్ట్ర సంచాలకులు బి శ్రీనివాసరావు




అమరావతి (చైతన్యరథం): పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా అధ్వర్యంలో రూపొందిన 'మనబడి' మాసపత్రికను బాపట్లలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించారని సమగ్ర శిక్షా పథక రాష్ట్ర సంచాలకులు బి శ్రీనివాసరావు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, బాపట్ల ఎంపీ టి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మ, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, బాపట్ల కలెక్టర్ వెంకట మురళి, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కరదీపికలా ఉపయోగపడే మనబడి మాసపత్రికను రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు అన్నింటికి నెలనెలా పంపుతామని తెలిపారు. సామాజిక మాధ్యమాలు, వాట్సప్, యాప్, వెబ్‌సైట్ ద్వారా 'మనబడి' ఈ- కాపీ అందరికీ చేరుస్తామన్నారు. విద్యార్థులు వేసిన బొమ్మలు, రాసిన కథలు, కవితలు, పాటలు, వినూత్న ప్రయోగాలు, ఆటలు, సాధించిన విజయాలు-బహుమతులు, విద్యార్థుల విజయగాథలకు పత్రికలో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తల వ్యాసాలు, ఆలోచనలతో మాస పత్రికను అందంగా, ఆకర్షణీయంగా తీసుకురావడం తమ లక్ష్యమని వివరించారు.

'మనబడి' గౌరవ సలహాదారులుగా ఉన్నతాధికారులు, ఎడిటర్‌గా తాను, వర్కింగ్ ఎడిటర్‌గా సీనియర్ జర్నలిస్ట్ చల్ల మధుసూదనరావు, పీఆర్వోగా గణేశ్ బెహరా, సలహా సభ్యులు, ఎడిటోరియల్ కమిటీ మాసపత్రిక ప్రచురణ బాధ్యతలు చూస్తుందని తెలిపారు.

రచనలు పంపాల్సిన చిరునామా:

ఆసక్తిగల విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ రచనలను "సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ అండ్ ఎడిటర్, సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం, కేబీసీ బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్,పటమట,విజయవాడ,ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్,పిన్:520010, వాట్సాప్ నంబర్: 8712652298 ఈ-మెయిల్: manabadimagazine@gmail.comకు పంపవచ్చున్నారు.

# సీఎం చంద్రబాబు నేతృత్వంలో స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

## ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ ఆకాంక్ష - రాష్ట్రాభివృద్ధి కోసం దుర్గమ్మకు పూజలు



విజయవాడ (చైతన్యరథం): కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అన్ని రంగాలలో సమగ్ర అభివృద్ధి సాధించాలని, అన్న ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ ఆకాంక్షించారు. శక్తిస్వరూపిణి, సర్వలోకాలకు ఆది దేవత బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తితో కలసి ఆదివారం అమ్మకు రామకృష్ణ ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... కష్టకాలంలో అమ్మను శరణు వేడితే, అన్నింటికీ పరిష్కారాలు లభిస్తాయని, లోక కళ్యాణం కోసం అమ్మవారిని పూజించడం మన పూర్వీకుల నుండి వస్తున్న సంప్రదాయం అన్నారు. గత పాలకుల వైఫల్యాలు రాష్ట్రానికి పెనుశాపంగా మారి, రాష్ట్రం మరింత వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్న తరుణంలో, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేయడం ముదావహమన్నారు. ప్రజలందరి విశ్వాసం, మద్దతుతో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్ది, రాష్ట్ర ప్రజల పట్ల తనకున్న నిబద్ధతను, చిత్తశుద్ధిని చాటుకుంటుందన్నారు.

గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం అమ్మవారిని పూజించడం ద్వారా, ప్రకృతి సమతుల్యత, శాంతి, సర్వమానవుల శ్రేయస్సు సిద్ధిస్తాయని, అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్రం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతుందని తన ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమ్మవారి పూజ ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ సంపద, శాంతి, సుఖసంతోషాలు లభించాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వంగా ఆవిర్భవించిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజలందరి ఆకాంక్షలను నెరవేర్చుతూ ముందుకు సాగుతోందని, ఈ ఐదేళ్లు రాష్ట్రానికి స్వర్ణ యుగంలాగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పేరేపి ఈశ్వర్, ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శాంతి శివరాం ప్రసాద్, వల్లూరు కిరణ్, సాయి జ్యోతి, మహేందర్ రెడ్డి, బీసీ సెల్ అధికార ప్రతినిధి అశోక్ కుమార్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించండి

- సీఎం చంద్రబాబుకు వీహెచ్‌పీ నేతల వినతి



అమరావతి (చైతన్యరథం): దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని సీఎం చంద్రబాబును విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నేతలు కోరారు. వీహెచ్‌పీ అఖిల భారత సంఘటన ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే, అఖిల భారత ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు.. సీఎం చంద్రబాబుని కలిసి దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించే విషయమై వీహెచ్‌పీ రూపొందించిన ముసాయిదా ప్రతిని అందించారు. అంతే కాకుండా విజయవాడలో వచ్చే ఏడాది జనవరి 5న జరగబోయే 'హైందవ శంఖారావం' బహిరంగ సభ వివరాలను కూడా తెలియజేశారు. సీఎం చంద్రబాబును కలిసిన వారిలో గుమ్మళ్ళ సత్యం, శ్రీవేంకటేశ్వర్లు, దుర్గ ప్రసాద రాజు, రవికుమార్ ఉన్నారు.

## కొనసాగుతున్న అల్ప పీడనం

- రాష్ట్రానికి వర్ష సూచన



అమరావతి (చైతన్యరథం): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ తెలిపింది. బుధవారం నాటికి శ్రీలంక-తమిళనాడు తీరాలకు చేరే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఈ నెల 15 వరకు కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ సూచించింది.

# శకునిలాంటి వ్యక్తి విజయసాయి రెడ్డి

- హోం మంత్రి అనిత ధ్వజం
- వైసీపీ పాపాలు బయటపడుతుంటే ట్వీట్లు పెరుగుతున్నాయని ఎద్దేవా
- కాకినాడ పోర్ట్‌లో దందాలన్నీ వెలికితీస్తాం
- భూ అక్రమాలన్నింటిలో వైసీపీ నేతలే పాత్రధారులు





విశాఖపట్నం (చైతన్యరథం): వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి శకుని లాంటి వ్యక్తి అని హోంమంత్రి వంగలపూడి అనిత దుయ్యబట్టారు. ఆదివారం విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ 2018లో అప్పటి హోం మంత్రి చినరాజప్ప భూమి పూజ చేసిన ఆరిలోవ పోలీస్ స్టేషను.. కూటమి ప్రభుత్వంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క పోలీస్ స్టేషన్ నిర్మాణం కూడా చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక దానిపై దృష్టి పెట్టాం. నగరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. బాడీ కెమెరాలు, నూతన ఫేస్ డిటెక్టివ్ సిస్టమ్స్ కొనుగోలు చేశాం. డ్రోన్ కెమెరాలతో గంజాయి గుర్తించి ధ్వంసం చేస్తున్నాం. గంజాయి, డ్రగ్స్ కట్టడికి ఏర్పాటు చేసిన ఈగల్ వ్యవస్థ అప్పుడే పని మొదలు పెట్టిందని అనిత పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో మళ్లీ ఎక్స్ వేదికగా చంద్రబాబును లోకేష్ ను టార్గెట్ చేస్తున్న వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి పైన ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. విజయసాయి రెడ్డి శకుని లాంటి వ్యక్తి అని ఆమె మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం చంద్రబాబు మధ్య విభేదాలు రేకెత్తించేలా ట్వీట్లు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ పాపాలు బయటపడుతుంటే ఆ పార్టీ నేతల ట్వీట్లు పెరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి స్థానంలోని వ్యక్తి పట్ల విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు నేరాల్లో భాగస్వాములయ్యారని స్పష్టంగా తెలుస్తోంది. కాకినాడ పోర్ట్ వ్యవహారంలో అన్ని విషయాలు బయటకు వస్తున్నాయి. వైసీపీ నేతలు అందరినీ బెదిరింపులకు గురిచేశారు. కాకినాడ పోర్ట్ వేదికగా రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంలో వాస్తవాలు వెలికితీస్తామన్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందని.. వైసీపీ నేతల దందాలన్నీ వెలుగులోకి వస్తాయన్నారు. ఎక్కడ భూ అక్రమాలు వెలుగు చూసినా, అందులో వైసీపీ నేతల పాత్ర ఉంటోంది. విశాఖలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అక్రమాలు బయటకొచ్చాయి.








పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఆదివారం దేశమ్మతల్లికి పసుపు కుంకుమలు సమర్పించి నమస్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి .. వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి



## నెల్లిమర్లలో అన్న క్యాంటీన్ ప్రారంభం

విజయనగరం (చైతన్యరథం): నెల్లిమర్ల నగర పంచాయతీలో ఆదివారం అన్న క్యాంటీన్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంచి సంకల్పంతో రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు ప్రారంభించారని తెలిపారు. లక్షల మంది పేద ప్రజల ఆకలని తీరుస్తున్నాయన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ నాయకులు కడగల ఆనంద, సువ్వాడ రాజశేఖర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే బోనెల ఆత్మీయ సమ్మేళనం



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయచంద్ర అధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుగనుంది. ఈ కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు , మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం ఎమ్మెల్యే (విప్) జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ, పార్టీ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ , చైర్మన్లు విచ్చేయనున్నారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల ఆత్మీయ కుటుంబ సభ్యులు ప్రతిఒక్కరు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

### మామిడి వారి కళ్యాణ వేడుకకు హాజరైన కురుపాం ఎమ్మెల్యే

పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యుడు మామిడి గోవింద్, సుదిష్టన దంపతుల ఆహ్వానం మేరకు విశాఖపట్నం నోవాటెల్‌లో మామిడి వారి కళ్యాణ మహోత్సవానికి హాజరై వధూవరులు సాయి జయకృష్ణ, వైష్ణవిలను ఆశీర్వదించిన కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి



## రైల్వే అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష



విశాఖపట్నం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన రైల్వే అభివృద్ధి పనులపై విశాఖపట్నంలో ఆదివారం కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమీక్షించారు. అమృత భారత్‌లో భాగంగా శ్రీకాకుళం , నౌపాడ స్టేషన్ల అభివృద్ధి నౌపాద -గుణుపూర్ లైన్‌లో క్రాసింగ్ స్టేషన్ నిర్మాణం, టెక్కలి , పాతపట్నం స్టేషన్ల అభివృద్ధి పొందూరు -పలాస మధ్య జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. త్వరితగతిన పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వాల్తేరు ఏడిఆర్‌ఎం మనోజ్ సాహు, సీనియర్ డిఈఎన్ వెంకటరమణ, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పాల్గొన్నారు.

## వైజాగ్ ఓపెన్ జాతీయస్థాయి కరాటే పోటీల ట్రోఫీ ఆవిష్కరణ



విశాఖపట్నం (చైతన్యరథం): వైజాగ్ ఓపెన్ జాతీయస్థాయి కరాటే పోటీల ట్రోఫీను ఆదివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీలో నివాసంలో ఆవిష్కరించారు. పోటీలు ఈనెల 15 నుంచి పోర్టు. స్టేడియంలో విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జాతీయస్థాయి కరాటే పోటీలకు విశాఖ వేదికవ్వడం అభినందనీయమన్నారు. కరాటే హబ్ విశాఖ తయారైందని, పోటీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పోటీల్లో పాల్గొనడానికి వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.పి. వాడోకాయ్ దు కరాటే సంఘం అధ్యక్షుడు సీహెచ్, సతీశ్ కుమార్, కార్పొరేటర్లు లొడగల అప్పారావు, అక్కిరెడ్డి జగదీష్ కరాటే సంఘ మాస్టర్లు పాల్గొన్నారు.

### ముగిసిన కిక్ బాక్సింగ్ పోటీలు

ఎ.పి. కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారం ఏయూలో ముగిశాయి. పోటీల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు నువ్వా నేనా అంటూ తలపడ్డారు. పోటీల్లో మహిళల విభాగంలో జయశ్రీ స్వర్ణం, వెంకటలక్ష్మి రజతం, బాలికల విభాగంలో డి సంజన, తేజస్విని, పురుషుల విభాగంలో ఎస్.లోకేష్ స్వర్ణం, చందు రజతం. బాలుర విభాగంలో క్రియాన్ స్వర్ణం, అశ్వత్ రజతం గెలుపొందారు. విజేతలకు పతకాలు జిల్లా ఒలింపిక్స్ సంఘం కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని అందజేశారు. విజేతలు ఢిల్లీలో త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో, పాల్గొననున్నారు. ముగింపోత్సవంలో సిహెచ్. సతీష్ కుమార్, ఎ.పి. కిడ్బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి ఈత పోటీల విజేతలు ఎన్టీఆర్. విశాఖ జట్లు

రాష్ట్రస్థాయి. వింటర్ ఆక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీలు నగరంలో బీచ్లులో ఆక్వా స్విమ్మింగ్ ఫూల్ వద్ద ఆదివారం రాత్రి ముగిశాయి. ఫ్రీస్టయిల్, బ్యాక్ క్, బెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లయ్, వ్యక్తిగత మెడలీ విభాగాల్లో వివిధ జిల్లాలకు చెందిన స్విమ్మర్లు హోరాహోరీగా తలపడ్డారు. పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్షిప్ను 199 పాయింట్లతో కైవసం చేసుకుంది. ఆ జట్టుకు 24 స్వర్ణ, 22 రజత, 13 కాంస్య పతకాలు గెలుపొందింది. ద్వితీయ స్థానంలో విశాఖ జట్టు 85 పాయింట్లతో నిలిచింది. 6 స్వర్ణ, 13 రజత, 16 కాంస్య పతకాలు గెలుపొందింది. విజేత జట్లకు ట్రోఫీలు, పతకాలను జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి భారత వెయిటులిఫ్టింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడు కంచరాన సూర్యనారాయణ, జిల్లా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకట్రామ్ము అందజేశారు. ముగింపోత్సవంలో పలువురు కోచ్‌లు, క్రీడా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## మానవాళికి భగవద్గీత శ్లోకాలు మంచి మార్గ నిర్దేశం చేస్తాయి

విశాఖపట్నం (చైతన్యరథం): అధునిక సమాజంలో మానవాళికి భగవద్గీత శ్లోకాలు మంచి మార్గ నిర్దేశం చేస్తాయని ఎంవీపీ కాలని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ పట్నం శాఖ క్లస్టర్ సూపరింటెండెంట్ ఎం. కాంతి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎంవిపి కాలని టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో జరిగిన పిల్లల భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక ప్రపంచమంతా విద్వేషం, ఉన్మాదంతో రగిలి పోతున్న ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో మానవాళికి భగవద్గీత శ్లోకాలు మంచి మార్గంలో నడుపుతాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యన్నారాయణ మాట్లాడుతూ.. భగవద్గీత అభ్యాసం చేసే పిల్లలు సంస్కార వంతంగా జీవిస్తూ, క్రమశిక్షణ, కఠోర పరిశ్రమలతో జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు..

జోన్-2
కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమండ్రి, ఏలూరు
చైతన్యరథం

# పాలకొల్లులో 15న సేవ్ ది గర్ల్ చైల్డ్ 2కే రన్

◆మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టీకరణ



పాలకొల్లు (చైతన్యరథం): జగన్ పాలనలో యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి నిర్వీర్యమయ్యారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాలకొల్లులో డిసెంబర్ 15వ తేదీన సేవ్ ది గర్ల్ చైల్డ్ పేరుతో 2కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆడపిల్లలను రక్షించుకుందాం, భ్రూణ హత్యలు నిర్మూలిద్దామనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆడపిల్లలే జాతికి నిజమైన సంపద అని, ఆ సంపదను కాపాడుకోవటానికి ప్రతిఒక్కరూ కలసి రావాలని మంత్రి నిమ్మల పిలుపునిచ్చారు.

ఆడపిల్లలకు మేనమామ అంటూ రాష్ట్రంలో వేలాది మంది అపహరణకు గురైనా ఏనాడూ వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఇంటికి పెద్దన్న అవుతానంటూనే సొంత తల్లి , చెల్లెళ్లకే న్యాయం చేయలేదని మండిపడ్డారు. వారిపై పేటీఎం కూలీలతో సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో లేనిపోని నిందలు మోపిన దుర్మార్గుడు జగన్ అని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలను అరికట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

ఉత్తమ సేవలందించిన కార్యకర్తలకు

# అభినందన పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బండారు



కొత్తపేట (చైతన్యరథం): మన తెలుగుదేశం పార్టీ యాప్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు కార్యకర్తలకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం అభినందన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి, ప్రజలకు వారధిగా నిలిచి మన టీడీపీ యాప్‌ను ఉపయోగించి ప్రజలను సోషల్ మీడియా పోస్టులతో చైతన్యవంతులను చేస్తున్న కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని అన్నారు. వారిని అభినందించడం అంటే కార్యకర్తలపై తెలుగుదేశం పార్టీకి ఉన్న ప్రాముఖ్యతకు నిదర్శనం అని అన్నారు. తెలుగుదేశం పార్టీ నుండి అభినందన పత్రాలు అందుకున్న వారిలో శీలం ఆంజనేయులు, కముజు వర్మప్రసాద్, దిడ్ల సురేష్, కె శ్రీనివాసరావు, వీరవెంకట సందీప్ రెడ్డి, చెల్లుబోయిన శ్రీనివాస్, ఇమ్మిడి నాగరాజు, ఎన్ ఎస్ నాని ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గొడవర్తి బాబీ, పసుపులేటి రాధాకృష్ణ, కోట వెంకటేశ్వరరావు, బొక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు జి.ఎం.కె ట్రస్ట్ చేయూత



ముమ్మిడివరం (చైతన్యరథం): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఐరవయ్యవ వార్డులో నివాసముంటున్న మహిళ కొప్పిశెట్టి భూలక్ష్మి ఇల్లు వారం రోజుల క్రితం అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. అగ్నిప్రమాద సమయంలో ఆమె స్థానికుల సహాయంతో బయటపడింది.

రెండు రోజుల క్రితం స్థానిక శాసనసభ్యుడు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ఆమెను పరామర్శించి ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సర్వం కోల్పోయిన భూలక్ష్మిని ఆదుకునేందుకు నేనున్నాంటూ హైదరాబాదుకు చెందిన జి.ఎం.కె ట్రస్ట్ ముందుకు వచ్చింది. జి.ఎం.కె ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గుత్తుల మీరాకుమార్, కార్యదర్శి పిల్లి నాగ గోపాలకృష్ణ మరియు దాతల ద్వారా సమకూర్చిన సుమారు యాభై వేల రూపాయల విలువగల గృహ ఉపయోగ సామాగ్రిని హైదరాబాదు నుండి వచ్చిన సంఘ పెద్దల సమక్షంలో, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు గుత్తుల సాయి చేతుమీదుగా ఆదివారం బాధితురాలికి అందచేసారు.

రాష్ట్రంలోని శెట్టిబలిజ కులస్తులకు ఎక్కడ ఏ ఆపద వచ్చినా నేనున్నాంటూ వారికి ధైర్యానిచ్చి ఆర్థికంగా సహాయం చేస్తున్న జి.ఎం.కె ట్రస్ట్ అధ్యక్షులు గుత్తుల మీరాకుమార్ సేవలను స్థానికులు కొనియాడారు.

# రొయ్యకు వైరస్.. దిక్కుతోచని ఆక్వా రైతు

ఆక్వాసాగు ప్రస్తుతం ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటోంది. ప్రతికూల వాతావరణం మూలిగే నక్కపై తాడిపండు పడిన చందాన మారింది. ఆక్వా సాగులో వైరస్ విజృంభిస్తోంది.

### ప్రతికూల పరిస్థితులు

భారీ వర్షాల కారణంగా చెరువుల్లోని నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ముంపునకు గురైన పలు చోట్ల నీటి ద్వారా వైరస్ వ్యాపించింది. ప్రస్తుతం చెరువుల్లో రొయ్యలకు వైట్ పీసెస్ (తెల్లరెట్ట), వైట్ గట్ (తెల్ల పేగు) వ్యాధి, విబ్రియో. ఈహెచ్పీ ఉధృతి తీవ్రంగా ఉంది. ఈ వ్యాధులు సోకితే రొయ్యల విసర్జితాలు చెరువులో నీటి పైభాగానికి తేలిపోతాయి. రొయ్యలు మేత తినడం నిలిచిపోవడంతో ఎదుగుదల మందగించి చనిపోతున్నాయి. దీని నివారణకు పెట్టుబడులు పెరిగిపోవడం మినహా ప్రయోజనం ఉండడం లేదు. అప్పటికి రొయ్యలు ఏ కౌంట్ లో ఉన్నా పట్టుబడి పెట్టక తప్పడం లేదు. ఇటీవల నెల రోజుల్లో సుమారు 10 వేల ఎకరాల్లో రొయ్య పిల్లలు వేసిన 10 నుంచి నెలన్నర రోజుల్లో వ్యాధుల బారినపడి తీసేయాల్సి వచ్చిందే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. హేచరీల నుంచి నాణ్యమైన రొయ్య పిల్లలు రాకపోవడమే దీనికి కారణమని రైతులు చెబుతున్నారు.



### కుదేలవుతున్న చిన్న రైతులు

ఎకరా నుంచి రెండు ఎకరాల అక్వా సాగు చేస్తున్న వారు 80 శాతం మంది ఉన్నారు. ప్రొబయోటిక్, వ్యాధుల నివారణకు వినియోగించే మందులు ఖరీదు భారీగా ఉండటంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. అన్నీ అనుకూలిస్తే మూడు నెలల్లో 30 కౌంట్‌కు (కిలోకు 30) పెరుగుతాయి. ఇలా కేవలం 20 శాతం చెరువుల్లో మాత్రమే దిగుబడి వస్తోంది.




# పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

◆కొత్తపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే సత్యానందరావు పిలుపు

కొత్తపేట (చైతన్యరథం): కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలిచే తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యుల పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసాగా ఉండేందుకు సభ్యత్వం చాలా ముఖ్యమని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం 100 రూపాయలు చెల్లించి తీసుకుంటే 5 లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువుకి ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు వంటి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం అవ్వడానికి పార్టీ కుటుంబ సభ్యులంతా కలిసి కృషి చేయాలని సత్యానందరావు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాకినాడ ఎస్ఈజెడ్‌పై బహిరంగ చర్చకు రావాలి

## వైసీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే వర్మ సవాల్

పిఠాపురం (చైతన్యరథం): కాకినాడ ఎస్ఈజెడ్‌పై బహిరంగ చర్చకు రావాలంటూ వైకాపా నేతలకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సవాల్ విసిరారు. మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ వంగా గీత నిర్వహించిన ప్రెస్‌మీట్‌కు కౌంటరుగా వర్మ ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. కాకినాడ ఎస్ఈజడ్ వ్యవహారంలో వైకాపా నేతల్లో వణుకు మొదలైందని అన్నారు.

రైతులపై తెలుగుదేశం ప్రభుత్వం కేసులు పెట్టిందని విమర్శిస్తున్న వైకాపా నాయకులు కాకినాడ ఎస్ఈజడ్ పెట్టింది ఎవరో తెలుసుకోవాలన్నారు. సెజ్ ఎవరు ప్రారంభించారు? ఎవరెవరు బినామీలు ఉన్నారనే విషయాలను సోమవారం సాయంత్రం 3 గంటలకు ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించే బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. వైకాపా నేతలు బహిరంగ చర్చకు రాకపోతే అన్యాయం చేసిందే మీరేనని అంగీకరించినట్టేనని పేర్కొన్నారు.

## వరి, మొక్కజొన్న పంటలకు బీమా

తాళ్లపూడి (చైతన్యరథం): రానున్న రబీలో వరి, మొక్కజొన్న పంటలకు పంటలకు ప్రధానమంత్రి ఫసలీ బీమా యోజన అమలు చేస్తున్నారని, ప్రభుత్వం అమలు చేసున్న దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఏవో రుచిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లపూడి మండలంలోని రైతుసేవా కేంద్రాల వద్ద పూర్తి సమాచారం ఉందన్నారు. అధిక వర్షాలు, తుపాన్లు, ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన, దిగుబడి తగ్గినా పంటపరిహారం వస్తుందన్నారు. వరి పంటకు ఎకరానికి రూ.630, మొక్కజొన్నకు రూ. 540 ప్రీమియం చెల్లించాలన్నారు. మొక్కజొన్నకు ఈనెల 15, వరిపంటకు ఈనెల 31తేదీ ఆఖరి తేదీని తెలిపారు.









# తెలుగు వారి గర్వకారణం పొట్టి శ్రీరాములు

◆ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆత్మార్పణ

◆ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నివాళి

◆కందుకూరులో కాంస్య విగ్రహం ఆవిష్కరణ

నెల్లూరు (చైతన్యరథం): అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగువారి చైతన్యమూర్తి అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన వారు కావడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కృషిచేసిన మహనీయుడని నివాళులు అర్పించారు. కందుకూరు పట్టణంలోని వెంకటనారాయణ బజార్లో ఆదివారం అమరజీవిపొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. కందుకూరు శాసనసభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ అభివృద్ధి చైర్మన్ డూండి రాకేష్ ఆర్యవైశ్య సోదరులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు పెద్దలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తమకు ఘన స్వాగతం పలికిన ఆర్యవైశ్య సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు తన ప్రాణత్యాగం ద్వారా తెలుగు ప్రజల హక్కుల కోసం చేసిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. మన తర్వాతి తరాలకు ఆయన త్యాగం గుర్తుండేలా ఇలాంటి విగ్రహాలు ఏర్పాటు చేయటం ఎంతో శుభ పరిమాణం అని పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు మన జిల్లాకు చెందిన వారు కావటం మనకు ఎంతో గర్వకారణం అని ఎంపీ గారు తెలియజేశారు.. ఆర్యవైశ్య సంఘం నేతలు తమ సొంత నిధులతో విగ్రహ నిర్మించడంపై ప్రశంసలు కురిపించారు.. ఆర్యవైశ్యులు అంటే నమ్మదగిన మనుషులు అని ఎంపీ తెలిపారు ప్రజల భాగస్వామ్యంతో ఇటువంటి గొప్ప కార్యక్రమాలు విజయవంతం అవుతాయని అభివృద్ధి దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు.రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల ఏకైక నాయకుడు నారా చంద్రబాబునాయుడు మాత్రమేనని విశ్వసించి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని తెలిపారు.. దానికి అనుగుణంగా మన ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతోపాటు రాష్ట్ర అభివృద్ధి దిశలో నడిపించే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో శనివారం ఒకేసారి 45 వేల స్కూళ్లలో మెగా పేరెంట్స్ టీచర్స్ డే సమావేశాలు ఏర్పాటు చేసి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని రాష్ట్రాన్ని ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే ప్రతి రంగంలో ప్రగతి సాధించేందుకు కృషి చేస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు తెలియజేశారు.

శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పెద్దలు నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు మన నియోజకవర్గంలో అమరజీవి పొట్టి శ్రీరాములు గారి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ముందుగా కందుకూరు నియోజకవర్గం ఆర్యవైశ్యులు, ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.. పొట్టి శ్రీరాములు గారు మద్రాస్ రెసిడెన్సీలో తెలుగు ప్రజల ఇబ్బందులు గమనించి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు నిరాహార దీక్ష ద్వారా తన ప్రాణాలను త్యాగం చేశారని ఆయన త్యాగం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం. ఈ ప్రాంతంలో ఆర్యవైశ్యులు వ్యాపారాలను సంతోషంగా ఉండేలా రాష్ట్రం అభివృద్ధి చెందేలా తెలుగు ప్రజలు అందరూ కలిసికట్టుగా పని చేయాలని, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలసికట్టుగా పనిచేస్తూ ప్రజల సంక్షేమం కోసం ముందుకు సాగుతున్నాయని ఎమ్మెల్యే తెలియజేశారు. నియోజకవర్గంలోని ఆర్యవైశ్య సోదరులకు ఏదైనా కష్టం వచ్చినా మీ కుటుంబ సభ్యుడిగా, మీ సోదరుడుగా ఎప్పుడు మీకు అండగా ఉంటారని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు మన యువ నాయకులు నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని, ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల ఏదైనా కష్టం వచ్చిన వారికి అండగా ఉండటానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముందుంటారని రాకేష్ తెలిపారు..ఈ కార్యక్రమానంతరం నియోజకవర్గ ఆర్యవైశ్యులు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుగజమాలతో ఘనంగా సత్కరించారు..తొలుత కందుకూరు పట్టణం పెద్ద బజార్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారికి రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీ డూండి రాకేష్ గారికి ఘన స్వాగతం పలికారు.. అనంతరం అమ్మవారి ఆలయంలో జరిగిన ప్రత్యేక నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కటవర్తి వాసు, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు దర్శి హరికృష్ణ, ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు కోటా హనుమంతరావు, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నార్నే రోశయ్య, జనిగిర్ల నాగరాజు మాదాల లక్ష్మీనరసింహం మరియు విగ్రహ కమిటీ నిర్వాహకులు, ఆర్యవైశ్య సోదరులు, కూటమి నేతలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..



# మాది మానవతా విలువలున్న ప్రభుత్వం

◆అనారోగ్య బాధితులను ఆదుకున్న ముఖ్యమంత్రి ధన్యవాదాలు

◆ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టీకరణ

నెల్లూరు (చైతన్యరథం): మానవతా విలువలున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొనియాడారు. నెల్లూరు నగరం మాగుంట లే అవుట్ లోని విపిఆర్ నివాసంలో కోవూరు మండలం పాటూరుకు చెందిన మట్టెం కృష్ణయ్యకు 1,62,000 ఇందుకూరుపేట కొత్తూరుకు వాసి పూనమల్లి వెంకట రమణయ్యకు 1,03,327, లేగుంటపాడుకు స్వర్ణ సుబ్బమ్మకు 81,000 బుచ్చి మండలం దామరమడుగు వాసి ఏటూరి 1,42,290 ఇందుకూరు పేట మండలం మైపాడు గ్రామానికి చెందిన పల్లికొండ శ్రీనివాసులు 1,19,386, బండి సుందీప్ 1,64,733 బుచ్చి మండలం పెనుబల్లి వాసి భాస్కర్ రెడ్డకు 84,000 మొత్తం 8,56,773 రూపాయల కోవూరు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులు అందుకున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ద్వారా అనారోగ్య బాధితులను ఆదుకున్న ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# కంచి కామకోటి పీఠాధిపతిని కలిసిన టీటీడీ చైర్మన్

తిరుపతి (చైతన్యరథం): కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీని టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఆదివారం తిరుమలలోని కంచి మఠంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామీజీ చైర్మన్‌ను ఆశీర్వదించారు. అనంతరం స్వామీజీ చైర్మన్‌తో మాట్లాడుతూ టీటీడీ నూతన ధర్మకర్తల మండలి ఇటీవల తీసుకున్న నిర్ణయాలను అభినందించారు. తిరుమల పవిత్రతను కాపాడే విధంగా , భక్తులకు మేలు చేకూరేలా నిర్ణయాలు తీసుకోవడం ప్రశంసనీయమని తెలిపారు. తిరుమలను మరింత సుందర దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలని, వేదవిద్య వ్యాప్తికి కృషి చేయాలని చైర్మన్‌కు సూచించారు.






# కుప్పంలో హార్టికల్చర్ హబ్‌లో సిబ్బందిని నియమించాలి

◆ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సూచన

శాంతిపురం (చైతన్యరథం): కుప్పంలో హార్టికల్చర్ హబ్‌లో సిబ్బందిని నియమించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. చిత్తూరు జిల్లా పరిషత్ మందిరంలో ఆదివారం నిర్వహించిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. టిడిపి ప్రభుత్వంలో కుప్పం హార్టికల్చర్ హబ్ ( సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ) ఏర్పాటు చేసి సుమారు 22 కూరగాయలు, పూలు తదితర రకాలు అభివృద్ధి చేసే ప్రక్రియ కొనసాగించారని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఏడాదికి రూ.3.5 కోట్లు టర్నోవర్ చేశారని, అయితే అక్కడ సిబ్బంది కొరత ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేస్తే అద్భుతం సాధించవచ్చని ఎమ్మెల్సీ కంచర్ల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

## స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

◆ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు జనసేన పార్టీ నాయకుల వినతి

గూడూరు (చైతన్యరథం): తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే సునీల్‌కుమార్ నివాసంలో జనసేన పార్టీ నాయకులు కలిసి నియోజకవర్గంలో నెలకొని ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తీగల చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని చిల్లకూరు,కోట మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే సమయంలో అక్కడి వారి నుంచి భూములు తీసుకొని స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి నామమాత్రంగా ఉద్యోగాలు ఇచ్చి బయటి ప్రాంతాల వారికి అధిక సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. దీంతో స్థానికంగా ఉన్న యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారని ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు.







# ఉద్యాన పంటల సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

## ◆శాస్త్రవేత్తలతో కలిసి పలు రకాల పంటల పరిశీలన

## ◆రైతులకు సలహాలు ఇవ్వాలన్న ఎమ్మెల్యే

రాప్తాడు (చైతన్యరథం): ప్రస్తుతం జిల్లాలో సాగులో ఉన్న ఉద్యానవన పంటలు, కంది పంట విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చెంద్రాయుడు, ఇతర శాస్త్రవేత్తలు డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ హరిణి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ శిరీష తదితరులతో కలిసి ఆమె పంటలను పరిశీలించారు. రామగిరి మండలం వెంకటాపురం, నర్సంపల్లి గ్రామాల్లో ఆదివారం పంట పొలాలను పరిశీలించారు. కంది, చీనీ, సపోటా, సీతాఫలం, కొబ్బరితోటలు, అల్లనేరేడు, ఉసిరి, చింత వంటి పంటలను పరిశీలించారు. ప్రధానంగా కంది పంటకు మరూకా మచ్చల పురుగు ఆశించి 60 శాతం వరకు దెబ్బతిన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. వెంటనే జిల్లాలో రైతులందరికీ తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.

అలాగే ఉద్యాన పంటల్లో అధిక దిగుబడి సాధించేందుకు రైతుల పొలాల వద్దకు వెళ్లి సలహాలు ఇవ్వాలని సూచించారు. ఉద్యానవన శాఖ అధికారులతో పాటు శాస్త్రవేత్తలు కూడా నిత్యం పొలాలను పరిశీలించాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చెంద్రాయుడు మాట్లాడుతూ కంది పంటకు మరూకా మచ్చల తెగులు ఆశించి చాలా వరకు దెబ్బతిందని... తాము సూచించిన విధంగా ఒరాజెన్ మరియు నీమ్ ఆయిల్ మందులు పిచికారి చేసుకోవాలని సూచిస్తూ పరిటాల సునీత సొంత వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయించారు. అలాగే చీనీలో ఇనుపదాతు లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అందుకు మల్టీ సెవెన్ అనే ఇనుప దాతును పిచికారీ చేసుకోవాలన్నారు. సీతాఫలం కూడా ఆశించిన దిగుబడి వస్తోందన్నారు.

కొబ్బరి పంటలో ఈస్ట్ వెస్ట్ రకంకి నల్లి పురుగు ఆశించిందని... దీనికి కూడా పిచికారి చేసుకోవాలన్నారు. ఉద్యానవన పంటలు అధిక దిగుబడి రావడానికి అంతర కృషితో పాటు కత్తిరింపులు వంటివి చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రైతులు కూడా తమకు తోచిన మందులు పిచికారి చేసుకోకుండా శాస్త్రవేత్తలు సూచించిన విధంగా మెలకువలు పాటించాలని సూచించారు.

# భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

## ◆టీడీపీ నేత మంచూరు స్పష్టీకరణ

బద్వేల్ (చైతన్యరథం): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వ సదస్సులు నిర్వహిస్తోందని, ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. "ఏ ఊర్లో చూసినా భూ వివాదాలు లెక్కలేనన్ని కనిపిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలతో అవి మరిన్ని పెరిగాయని తాజాగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమాల్లో సైతం అత్యధిక అర్జీలు భూ సమస్యలకు సంబంధించినవే అని అన్నారు. వాటికి అడ్డుకట్ట వేయాలని సర్కార్ సంకల్పించింది. సమస్యలు పరిష్కరించేందుకు అధికారులను నేరుగా ప్రజల వద్దకే పంపాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఆరవ తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. గతంలోనూ తెలుగుదేశం పార్టీ హయంలో రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను కొంతమేర పరిష్కరించారు. ఆరు నుంచి జనవరి 8వ తేదీ వరకు మరో మారు నిర్వహించనున్నారు. 33 రోజులపాటు జరిగే ఈ సదస్సులో భూ సమస్యలపై అధికారులు గ్రామాలకు వెళ్లి దరఖాస్తులను స్వీకరించి అక్కడికక్కడే రసీదులు ఇస్తారు. సమస్య తీవ్రత ఆధారంగా పరిష్కారానికి గడువు ఉంటుంది. ఏ ఏ గ్రామాల్లో ఏ రోజు సదస్సు జరుగుతుందని దానిపై నియోజకవర్గంలోని మండలాల రెవెన్యూ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అ ప్రకారం యంత్రాంగం గ్రామాల్లో పర్యటిస్తుంది. సదస్సుల నిర్వహణపై మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులతో దూర దృశ్య సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసి ఉన్నారు.



### అధికారులు ఏం చేయాలంటే..

పల్లెల్లో సభల నిర్వహణపై ప్రచారం చేయాలి. షెడ్యూల్ కు అనుగుణంగా సదస్సులో ఆయా గ్రామస్తులు హాజరయ్యేలా నియోజకవర్గంలోని మండల స్థాయిలో చర్యలు తీసుకోవాలి. కార్యక్రమానికి రెండు రోజులు ముందే గ్రామ పటాలు వెబ్ ల్యాండ్ నుంచి వన్ బి పత్రాల్లో నోటీస్ బోర్డ్ లో ఉంచాలి దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేయాలి. సదస్సుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నియోజకవర్గంలో కనీసం ఒక్క సదస్సుకు హాజరు కావాలి. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా కూడా ఎంపీపీ, జడ్పీటీసిలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని మంచూరు సూర్యనారాయణ రెడ్డి కోరారు.

# సామాజిక కవి ఆచార్య ఈశ్వరరెడ్డి

## ◆పురస్కార ప్రదానోత్సవంలో వక్తల ప్రశంస

కడప (చైతన్యరథం): సామాజిక బాధ్యతతో రచనలు చేస్తున్న ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డికి తుమ్మల సాహిత్య పురస్కారం అందించడం చాలా సంతోషంగా ఉందని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరులో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డికి తుమ్మల వెంకటరామయ్య పురస్కారం -2024 ను అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన పెనుగొండ లక్ష్మీనారా యణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటులో తుమ్మల వెంకట్రామయ్య నిర్మాణా త్మక పాత్ర పోషించారని, పీడితుల పక్షాన నిలబడి పీడకులను ప్రశ్నించారని అలాంటి రచయిత పేరుమీద ఏర్పాటుచేసిన ప్రతిష్టా త్మక సాహితీ పురస్కారాన్ని ప్రజాపక్షం వహించి రచనలు చేస్తున్న ఆచార్య ఎన్ ఈశ్వర రెడ్డికి ఇవ్వడం సంచితంగా ఉందని పేర్కొన్నారు. వచన కవిగా, గేయ కవిగా, విమర్శకుడిగా తనదైన పంథాలో నడుస్తున్న ఈయన కడప జిల్లా అరసం అధ్యక్షులుగా ఉంటూ తెలుగు భాషా సాహిత్యాలను పాఠశాల విద్యార్థుల దాకా తీసు కెళ్లిన ఘనత ఈయనకి ఉందని పేర్కొన్నారు. రాయలసీమ కరువు, వలసలపై ఈయన రాసిన గేయం చాలామందిని ఆలోచనలో పడే సిందని వివరించారు. చదువంటే మనిషి విలువను పెంచేదని, ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారాలు కావని, బతుకును మార్చగలిగేవి అక్షరాలేనని, స్వార్థపూరితంగా వ్యవహరించే మనిషి కూడా చివరికి మట్టిపాలు కాక తప్పదని ఈశ్వర రెడ్డి గేయాలు ప్రాపంచిక తాత్వికతను చెబుతున్నాయన్నారు. సమాజంలో పుట్టు కొస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపిస్తూ, వాటి పట్ల జనాన్ని జాగృతం చేస్తున్న ఆచార్య ఈశ్వర రెడ్డి నిజమైన అభ్యుదయ కవి అని కొనియాడారు. అభ్యుదయ గేయ సాహిత్యం పై స్మారకోప న్యాసం చేసిన ఆచార్య ఎస్ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గురజాడ ప్రారంభించిన మాత్రాఛందస్సులను ఆ తదనంతర కాలంలో చాలామం ది కవులు అందిపుచ్చుకున్నారని అన్నారు. ఆధునిక సాహిత్య ప్రక్రియలైన వచన కవిత, కథ, నవల, నాటకం మొదలైన వాటితో పోల్చుకుంటే గేయానికి ప్రభావశక్తి ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అనేక ఉద్యమాలకు గేయాలు వెన్నుముకలా నిలబడ్డాయని ఉదాహరించారు. గరిమెళ్ళ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, దాశరథి, ఆరుద్ర, ఆవంత్స సోమ సుందర్, సినారె, గద్దర్ అందెశ్రీ, గోరటి వెంకన్న, నాగభైరవ కోటేశ్వరరావు తదితరుల గేయ సాహిత్యాన్ని ప్రస్తుతించారు. అభ్యుదయ గేయాలు ప్రజలకు చైతన్య వీచికలుగా నిలుస్తూ అజరామరంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నాటక రచయిత అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్ర సాద్, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ మనోహర్ , అభ్యుదయ రచయి తలు కె శరత్, బూర్ల రవి, కోసూరి తదితరులు హాజరయ్యారు.



# ఫిబ్రవరి 8,9 తేదీల్లో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం మహాసభలు

## ◆ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి వెల్లడి

కడప (చైతన్యరథం): వచ్చే ఏడాది ఫిబ్రవరి 8, 9 తేదీల లో నిర్వహించబోయే వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం మహాసభలకు సంబంధించి సన్నాహాక సమావేశాన్ని ఆదివారం ఎర్రముక్కపల్లెలోని సిపి బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించారు. వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 8 ,9 తేదీలలో చేయబోయే జిల్లా రచయితల సంఘం మహా సభలు రాయలసీమ సాంస్కృతిక సాహిత్య ఖ్యాతిని చాటేలా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాజీ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున రెడ్డి పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో రాయలసీమ సాహిత్య అధ్యయనంపై సదస్సులు, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ముఖ్యంగా ఈ మహాసభలలో యువతకు , విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని అన్నారు తెలిపారు.

ఈ సదస్సులకు శలాక రఘునాధ శర్మ, కొలకలూరి ఇనాక్ ,బేతవోలు రామబ్రహ్మం, కపిలెడ్డి వెంకటరెడ్డి , కాత్యాయని విద్మహే లాంటి ప్రముఖ సాహితీవేత్తలను ఆహ్వానిస్తు న్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైయస్సార్ జిల్లా రచయితల సంఘం రెండవ మహాసభలను ఏ విధంగా నిర్వహించాలో కార్యక్రమా విధివిధానాలను తెలియజేస్తూ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని, ప్రధానకార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శులు డా భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి , డా. పొదిలి నాగరాజు ,, భూమిరెడ్డి స్వరూప రాణి, కోశాధికారి డా. రెడ్డి శేఖర్ రెడ్డి, సభ్యులు డా.జి.వి.సాయి ప్రసాద్, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వర చారి , తవ్వా వెంకటయ్య , అనుగూరు చంద్రశేఖర్ రెడ్డి, డా. పెద్దిరెడ్డి నీలవేణి, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని దంపతులను జిల్లా రచయితల సంఘ అధ్యక్షులతోపాటు సభ్యులందరూ ఘనంగా సత్కరించారు.

